# దినం చచ్చేవాడికి ఏడ్చేవాడెవుడు?

అయ్యోరంటే అరుణాచలమే అయ్యోరని ఈమద్దె మన ప్రెబుత్వంవాళ్లు ఆయనకొక అవార్డు యిచ్చినారంట!

అరుణాచలం నా సావాసకాపు. ఆయన ఒక పెద్ద ప్రొపసర్. ఆయన ప్రొపసర్ తనం ఉంటే ఆయన దగ్గిర్నే ఉంటిందని నేను మాత్రం ఆ మణిసితో శానా యాసణ్ణం పడ్తావుంటా. పసిరిక పాము. పట్టించుకుండే కతే లేదు.

''ఏం? అయ్యోరా?'' అంటే పలకతాడు.

''ఏం? కర్ణమాయినా?'' అంటే నవ్వుకుంటాడు.

''నీకేం బా? నువ్వు పెద్ద ప్రొపెసర్ గదా?'' అంటే యినీ యిన్నట్టుగా మొకం తిప్పుకుంటాడు.

ఊరుమింద ఊరుపణ్ణా కర్ణం మింద కాసు పడదంటారు. అయితే మా అరుణాచలం మాత్రం ఊరంతా ఎత్తినెత్తి నేసుకుంటాడు. ఏసుకుంటేగూడా అంత ఎర్రిబాగులోడేం కాదుగదా? ఎనకా ముందు ఆలోచించే తలదూరస్తాడు. లెక్కల్లో శానా గెట్టోడు గదా మణిసి. అంతా లెక్కాశారంగానే ఉంటిందిలే యవ్వారం. కర్ణాలకు లెక్కలకు శానా దగ్గిర చుట్టరికం ఉండేటట్టుగా ఉండాది. అందుకేనేమో ఈ మణిసి ఆడా

యీడాగాడు. ఏకంగా నీళ్ల కవతలికి పాయ్ చదువు చెప్పొచ్చిన మొగలాయి!

మాయబ్బతో చెప్తావుండా. నీళ్లకవతల ఏమి చదువు చెప్పినాడో ఏంపాడో నాకుతెల్లు. ఈడ మాత్రం నిమిశంసేపు నిలబడి చదువు చెప్పింది- నా కండ్లారా నేను చూళ్లా. అయితే ఎప్పుడుచూడు. ఈపొద్దు అయిద్రాబాద్ అంటే రేపు అలహాబాద్ అంటాడు. ఒకదినం గోవా అంటాడు. ఇంకొక దినం యిశాకపట్నం అంటాడు. అదెట్ల తిరగతాడో ఏమోగానీ మణిసి నిలికిలేకుండా తిరగతానే ఉంటాడు. ఈ నిలికిలేని సేద్దానికి మెచ్చుకోని ప్రెబుత్వం అయ్యోరంటే ఆయనే అని అవార్డు యిచ్చినారంట!

'ఒ' కు వంపులు తెల్లు. వగాతగా లేదు. గాడ్దికేం తెల్సు గెందోడి వాసన? ఆయన దగ్గిర ఎంత పనితనం ఉంటే అవార్డు యిస్తారు? అదేమి ఆలోచించకుండా నిలికిలేని సేద్దిమని నీళ్లతాగినంత లేసుగా మాటజార్తినే!

అందుకే ఏమిజారినా పరవాలేదు గానీ మాట మాత్రం జారగూడదంటారు పెద్దోళ్లు!

సరే! అందురికంటే ముందుగా...

''ఏం కర్మమయ్యా? కొటేసినావే శాన్సు. గీతసక్కంగా ఉండాదిలే?'' అని పలకరిస్తే చాలీసాలని శాలవొగిటి కప్పి సందెడు లావు పూలదండ ఏసినంత సంబరపడి పోతాడు మణిసి. అని అనుకుంటా పోను కాడికిపోతి. అది అప్పుడప్పుడు అలిగికూసుండే మా బాశాలి మాదిర్తో 'నీ మాటయినేది లేదుపో!' అంటా మొండికేసె.

''ఇంకేం చెయ్యాల్రా దేవుడో?... దీనిగ్గూడా యిప్పుడనంగానే రావాల్నా రారాని రోగం?'' అని దాని మిందేసిన చెయ్యెత్తేసి ఎత్తేసిన చేతిని నెత్తిమిందేసుకొని కూలబడ్తి. ఆ ఫోను అలక తీర్సాల. అది మన మాట యినాల. దీని కెట్టబ్బా దోవ?'' అని బుర్ర పాడు చేసుకుంటా వుంటే-

''దినమూ సచ్చేదాని కోసరం ఎవుడేడస్తాడు కానీ సెప్పాలనుకుంటే ఈడ కూలబడి ఏడ్సినంతసేపు పట్తిందా నేరుగాపాయ్ సెప్పొచ్చేదానికి?'' అంటా మాబాశాలి మీటనొక్కె. అప్పుడెలిగె టూబ్లైట్. నేను ఎలబార్తి.

నా చిన్నప్పుడు మాయింట్లో ఒక సేద్దిగాడుండేవాడు. పేరు వెంకట్రాయిలు. పనికి ఎగనాం పెట్టేదాంట్లో ఫలాతన్ నాయాలు. ఒకదినం తలకాయి నొప్పి. ఒక దినం మొలకాయి నొప్పి. ఇంకొక దినం యింట్లోడ్డి యింటికి దూరం. మల్లొకదినం పాణం ఏంబాగలేదబ్బా? యిట్లా పచ్చి అపద్దాలు చెప్పేదాంట్లో పచ్చలబిడిబాకు నాయాలు. అట్లాంటి సమయాల్లో-

''ఎట్లబ్బా? పెదబాయిలో తిరుగుడు కపిలకట్టాల. కానబాయి కాడ మడకలు కట్టాల. ఈ యదవ నాయాలికి ఈ పొద్దే వచ్చిందే మాయిదారి రోగం!'' అంటా మా అయ్య మినకరిస్తా ఉంటే, ''దినమ్మూ సచ్చేవాడికి ఏడ్సేవాడెవుడు గానీ నువ్వుపదే! నేనుండ్లా...'' అంటా దయిర్నం చెప్తా ఉండేది- మాయమ్మ.

దినమ్మూ చచ్చేవాడికి ఏడ్సేవాడెవుడని మాయమ్మ మాఅయ్యతో అనింది. ఎప్పుడు?

యాభైఏండ్లప్పుడు. అదేమాట ఈ పొద్దు మాబాశాలి నాతో అంటా ఉండాది. చూస్తా చూస్తా ఉండంగానే యాభైఏండ్ల కాలం చెల్లిపొయ్‌నా ఈమాటకు మాత్రం నూకలు చెల్లిపోలా. అదేగదా యిపుడాలోచించాల్సింది.

మాయమ్మ కాపరం చేసింది. మాబాశాలి కాపరం చేస్తా ఉండాది.

అయితే ఆ కాపరాల్లో ఎంత తేడా?

అప్పటికి యిప్పటికి ఎంత మారింది ఏంకత?

సమురు దీపాలు పాయ. కిర్సనాలు దీపాలు పాయ. పొయ్యిలో కట్టెబెట్టి పుర్‌పుర్‌మని ఊదేపని లేకపాయ. నీళ్ల చేదేపని పాయ. బానామోకు పాయ. బండీ కదురుగోలు పాయ. రెండెద్దల బండిలో కూసుండేదంటే రోతబుట్టి పాయ!

అదాడికి పొయ్యిందా? మణిసి పోరాని చోటికి పోలేని చోటిగ్గూడా అవులీలగా పొయ్యొచ్చేస్తా ఉండాడు. అయినా ఈ ఫోనుకు మా సేద్దిగాడి బుద్దులే వచ్చినట్లుండాది.

ఆ పొద్దు సేద్దిగాణ్ణి అడ్డం పెట్టుకోని దినమ్మూ చచ్చేవాడికి ఏడ్సేవాడెవుడని మాయమ్మ అనె. ఈ పొద్దు ఫోన్‌ను అడ్డంపెట్టుకోని మాబాశాలి అదేమాట అంటా ఉండాది. ఎంత మార్నా ఎన్ని మార్నా ఈ మాట మాత్రం కరుకుమాసి పోకుండా ఉండాదే? అని ఆలోచించుకుంటా పోతా పోతావుండి ఆ నాలుగ్గాళ్లమండపం కాడ ఒక అడుగట్టా నిలబణ్ణా.

ఎవురో యేమో. ఒకాయిన. మండపాని కెదురుగా చావిడి. ఆ చావిడి కెదురుగా నిలబడుకుణ్ణాడు. కద్దరు పంచ కట్నాడు. అది నేల జీరాడ్తా ఉండాది. ఏసుకోనుండే జుబ్బా మోకాళ్ల కిందికుండాది. ఆ నిలబడుకోనుండే వాటం చూస్తా వుంటే అయిద్రాబాద్ అవతారం చాలించేసి వచ్చి ఆ వాసనతోనే వాసాలకంగా బతకాలను కుణ్ణెట్టుండాది. తీరుబాటుగా నిలబడుకోని తెలుగు పేపరు తిప్పుతా ఉండాడు. పిడికిడి పచ్చనాకు పైకెత్తి పట్టుకుంటే దాని మింద్దికి ఎగబడే మేకలగుంపు మాదిర్తో కొందురా మణిసి చుట్టూరాచేరి నిక్కి నిక్కి నిలబడి పేపర్లోకి తొంగి తొంగి చూస్తావుండారు. 'ఏం జరిగిందో? ఏమో?' అనుకుంటా నేను గూడా అడికిబొయ్ ఆ మూతుల్లో మూతిని దూర్చేసినా. ఎట్టయినా నాదీ తెలుగు బుద్దేగదా?. ఆ యరవదాకా నోరు వాయి మెదపకుండా నిలబడుకోనుణ్ణె ఆ చెట్టంత మణిసి నాకల్లా ఎగాదిగా చూసి-

''ఈడేం పుట్టి మునిగిపోలా. ఎవురో రైతులంట. పది పన్నిండుమంది. సర్కారోళ్ల ఎండ్రిన్ తాగి ఎగిరిపోయ్‌నారంట. ఈ పేపర్ యిప్పితే చల్లంగా చావు కబుర్లు తప్పితే యింకేమి ఉంటాయిలే? దినమూ చచ్చేవాళ్లకు ఏవుడేడస్తాళ్లే? అయినా... ఆ అరవోడే మేలుగా ఉండాది. రిక్సామింద కూసోని వాడి పేపర్ వాడే చదువుకుంటా ఉండాడు.'' అంటా చేతిలో వుండే పేపర్ని తీసి నా మొకాన కొటేసి వాడిదోవన వాడు పాయ.

ఎట్టయితే ఏం? దూడ్డూ దుగ్గాణి లేకుండా పేపరు చేతి కొచ్చింది గదాని చూడబోతే ప్రెకాశం జిల్లాలో మండలాలవారీగా చూడబోతే ఉండే రావినూతల్లో దివ్వెలరాపూర్లో

పదుకొండు మంది. జె. పంగుళూరు మండలంలో అయిదు మంది. కొసురుగా యింకొల్లుల్లో యింకొకడంట. అప్పటికే వోల్మొత్తంగా ఎంత మంది? పదేడుమంది. గెవర్నమెంటోళ్ల అప్పుల బాదలు పళ్లేక ఆత్మహత్తెలు చేసుకున్నారంట!

వాడు! పేపరు తీసి నా మొకాన కొటేసిపాయ్‌న చెట్టంత మణిసి! ఇడిగిన మల్లిపువ్వు మాదిర్తో తెల్లంగా గుడ్డలేసుకోని గూడా కడుపుకు ఏమి తింటాడో? ఏమో? నాయాలు! ఏమనె?

''ఆడెవురో పది పన్నిండు మంది రైతులు సచ్చినారంట!''

అని ఎంత లేసుగా అనె. వాణ్ణి కోస్తే ఎచ్చూ తక్కవగా ఏడూళ్ల కయ్యేటట్టుగా ఉండాడు. వాడి వొంటి మిందికి తెల్లంగా గుడ్డ!... పిడ్సలు పిడ్సలుగా కండ!! ఎట్టొచ్చిందో ఒక్క సెణం ఆలోచించ గలిగితే అట్టా మాదిరంటాడా? యదవన్నర యదవ!

వాడొకడే కాదులే! రైతుకాడి కొచ్చేకుందికి అందురు యదవలు ఆడికే ఉండారు.

పరీచ్చల్లో సరిగ్గా రాయలేదని కొందురు. పస్టుకళాసు వస్తిందనుకుంటే ఏకంగా పట్టీ కొటేసి కొందురు. పిలకాయిలు రైలుకింద పణ్ణారని యింటా ఉండాం. మొగుడు పెట్టే బాదలు పళ్లేక పెండ్లాం బాయిలో దూకి చచ్చిందని యింటా ఉండాం. కట్నాలు కానికలు తేలేదని అత్తామామలు సతపోర్తా ఉంటే కోడాండ్లు కిర్సనాలెత్తి నెత్తిన కుమ్మరించుకోని అగ్గిపుల్లలు గీసి పెట్టుకున్నారని అప్పుడప్పుడు పేపర్లల్లో చదవతా ఉండాం. ఇంక లవ్ పిచ్చోళ్ల సంగతంటే చెప్పాల్సిన పనేలేదు. అయితే ఈళ్లందురుకీ అంత బువ్వబెట్టి రచ్చించే రైతన్నలే ఆత్మహత్తెలు చేసుకుంటా ఉండారంటే? ఇంక ఈ దేశిం ఏమయిపోతా ఉండాదనుకోవాల?

అయితే ఈళ్లు బతికి బట్టగట్ట బొయ్యేది ఎప్పుడబ్బా?

రాజుల కాలంలో అంటేనా? చెమటోడ్సి కష్టపడి పంట కళ్లంమిందికి తెస్తే చెమట తీసేసినోళ్ల మాదిర మారాజులు వస్తా ఉండ్రి. కళ్లం మింద పంట కళ్లం మింద ఉండంగానే ముందుబాగం మాదేనని ముందుకొచ్చి కూసుంటా ఉండ్రి. నవాబులంటేనా? మడకబట్టి దున్ని దున్ని అల్సిపాయ్‌న మొగలాయిల మాదిర లగుసుకుంటా ఉండ్రి. ఇంక బిటీషోడి హయాంలో అందామా? వాడు కంట్లో పాపను కత్తిరించే ఫలాతన్. లేనిపోని ఈ పీకులాటంతా మనకెందు కనుకున్నాడు. అలాగ్గా కూసున్నాడు. జమీందార్లను యినాందార్లను తట్టివదల్తా ఉండె. జమీందార్లు యినాందార్లంటే ఎవురు? అంతా మనోళ్లే గదా? మనోళ్లంటే ఓయమ్మో! చూసి రమ్మంటే కాల్సేసొచ్చే రకాలు. వాడికి వొకింత కట్టే అంతకు మూడింతలు మూతిమింద గొట్టి వసూలుచేస్తా ఉండ్రి. జమీందార్లు తిని యినాందార్లు తిని పాప్పరైటర్లు తిని పోగా యింకా మిగిలింది సగిలింది బిటీషోడు దొంగను తేలుకుట్నెట్టుగా మూటగట్టుకోని పోతావుండె. ఆ బిటీషోడు పాయ. జమీందార్లు పాయ్‌రి. ఇనాందార్లు పాయ్‌రి. పాప్పరైటర్లు పాయ్‌రి. ఇంత మంది పోతే యీళ్లందురు ఉడ్డజేరి తింటా ఉణ్ణింది ఎట్టపాయ్యిందబ్బా? అదెంతా మిగిలి పోవాలగదా? ఇంత మిగిలి పోతావుంటే ఈ రైతులెందుకు చస్తా ఉండారు? ఒరె వొరె! నా తెలివి తెల్లారి పాయ్‌నట్టే

ఉండాది. ఈళ్లందురు పాయ్‌నారంటే యాడికి పాయ్‌నారు? నామ్‌కే వాస్తే గదా పాయ్‌నట్టు లెక్క. కాదు గీదంటే టోపీలు మాత్రం నికరంగా మారిపాయ్ నాయబ్బా? దొర టోపీలకు బొదులు గాందీ టోపీలు! ఈ దేశింలో ఒక గాందీని అడ్డం పెట్టుకుంటే సాల్దా? ఈ జనానికి ఎటుమంటి టోపీ అయినా ఏసేయచ్చు!

ఒకరకంగా చూడబోతే తెంపులు పెట్టేదాంట్లో తెలివి మీర్నోడైనా తెల్లోడే మేలుగా ఉండాది. రైతులు బాదలు పడ్తా ఉండారంటే కంటి తుడుపుకైనా కమీషన్లు ఏస్తా ఉండె. కరువు కాటకాలొచ్చినాయంటే రంగూన్ నూకలైనా తెప్పించి ఉడికీ ఉడకని అంత గెంజైనా కాసి మొకాన కొడ్తా వుండె. అయ్యోరామ! యిప్పుడా? ఈడ యింతమంది చచ్చినారు. ఆడ అంతమంది చచ్చినారు. చూడండయ్యా మహాప్రబో? అంటే–

"కాంగ్రెసోళ్లు పాలిస్తా ఉణ్ణెప్పుడు ప్రజలు ఆకిల్తో అలమటిస్తా ఎట్టా చస్తా ఉణ్ణారో అట్టా మాదిర్నే యిప్పుడు దేశిమంతా చస్తా ఉండారు. అయితే ఆ చావులు మన రాష్ట్రంలో మాత్రం కాదు!" అంటా ముక్యమంత్రి ముక్కి ముక్కి నొక్కి పలకతాడా? ఈ యిడ్డూరం మాట్లు యాడైనా యిన్నారా? అబ్బా అమ్మకు పుట్నోడు ఎవుడైనా ఒకడు నోరుతెర్సి ఏందబ్బా ఈ అన్నాయమంటే–

"అరువులిస్తా ఉండాం. ఎరువు లిస్తా ఉండాం. అదీ సాల్లేదంటే అయిన కాడికి కరెంటిస్తా ఉండాం. ఇత్తనాల గింజిలిస్తా ఉండాం. కొత్త కొత్త రకంగా సేద్దాలు చేసుకోండయ్యా అని అదే పనిగా చెప్తా ఉండాం. టీవీల్లో చూపిస్తా ఉండాం!" అంటారు నిజిమే నబ్బా. చెప్తా ఉండారు. అదే పకారం చేస్తా ఉండారు. అయితే ఈ ఎర్రి నాయాలి గుంపు ఎందుకు బతకలేకుండా పోతా ఉండారే? ఏ యదవన్నా దీన్ని గురించి ఆలోచిస్తా ఉండాడా? యాదన పడ్తా ఉండాడా? పడేటట్టుగా ఉంటే ఎందుకీ మాదిర్తో ఆత్మహత్తెలు జరిగిపోతా ఉండాయ్!

పోనీ! అప్పులు యిస్తా ఉండా రబ్బా. కాదనలేం. అయితే ఆ యిచ్చేదాంట్లో గానీ తీసుకుండే దాంట్లో గానీ మార్వాడీ! – వాడే ఎయ్యి రెట్లు మేలుగదా? ఇస్తే యిస్తానంటాడు. లేకుండాబోతే రాంరాం అంటాడు. ఈళ్ల మాదిర తిప్పించి తిప్పించి నిలవన్నే చంపడే? వాడు అప్పిచ్చినాడే అనుకో. 'పంట పండ్లేదయ్యా. పల్లిం చేతికి రాలేదయ్యా?' అంటే యినిపించు కుంటాడు. ఈళ్లట్టాగాదే? ఈళ్లతపనంతా తాళిబొట్ల మిందన్నే గదా? మహన్నబావులు పుట్టిందెక్కడ? అరిచ్చెంద్రుడు పుట్నె బూమిలో గదా? వాడు ఆలి తాళినే అడిగె. ఆకాడికి మేలే. ఈళ్లు తెంచేది ఊలోళ్ల తాళ్లనే గదా? తాళ్లు తెంపేస్తే ఏ తంటాలే? తెంపేసినోళ్లు ఎట్ట బతకబోతారని చూడబొయ్యేది లే. కొంపల్లో జొరబడ్తారే? అవ్వి సత్తువయినా సరే! ఆ బోకులెత్తి యీదిలో యిసిరికొట్తారే? గొడ్డూ గోదా వుంటే జప్తీ చేసి పారేస్తారే? ఇక్కన పక్కన అదేందో యింత జరిగినట్టు చూస్తా ఉండారని యింగిత గ్నానం కూడా ఉండదే?

తిన్నా తినకుండా పాయ్‌నా పట్టు పీతాంబరాలే కట్టకుండా పాయ్‌నా గుట్టుగా

మట్టుగా వాళ్లనీళ్లు వాళ్లుతాగి బతికిన జల్మాలు గదా? ఇడ్సేసిన బతుకులైతే యాదికెక్కినా బాదపడవు. ఆడికే ఎంతో బయిశారినట్టు బావల్లోపడో ఉరేసుకోనో చస్తారే! అరెరె! ఏంగెతి పట్టిందబ్బా ఈ అన్నదాతకు?'' అని ఆలోచించుకుంటా నిలబడుకోనుంటే ముత్తారెడ్డన్న ఎప్పుడొచ్చినాడో ఏమో? పక్కన నిలబడుకోని ముసి ముసిగా నవ్వతా ఉండాడు.

''నీకు నవ్వులాటగా ఉండాది గదన్నా?'' అంటే చేతిలో వుండే పేపరు పుసక్కుమని పెరుక్కుండె. తాటి కాయంత అచ్చిరాల్తో అచ్చుగుద్దుండే ఆత్మహత్తెల కతలు ఈ కడనుండి ఆ కడదాకా చదివేసె.

''ఒరే అబ్బోడా! ఇప్పుడు నీ బాదేందో ఏడవరా? ఆ చచ్చినోళ్ల కోసరం ఆ నాలుగ్గాళ్లమండపం కాడ ఒక సంతాప సబ పెట్లేదని బాదపడ్తా ఉండావా? పెట్టక పోతే పొయ్యింది. ఈళ్లందురు వాళ్లను గురించి మాటాపలుకు లేకుండా మట్టి తిన్నె పాముల్లా పడుండారని బాదపడ్తా ఉండావా? సబ్సిడీ రేట్లో చవగ్గా యిచ్చిన గెవర్నమెంటోడి ఎండ్రిన్ తాగేసి చచ్చినోళ్లను ఎత్తుకోని ఊరూనాడు ఊరేగించలేదని యాశారపడ్తా ఉండావా? ఈ కోన్ కిస్కా గాళ్ల కోసరం అందురూ పనీ పాటా మానుకోని వారందినాలైనా యాడవాలని తుడుంకొట్టి చెప్పలేదని తపనపడ్తా ఉండావా? ఒరే పిచ్చోడా? ఈళ్లేం నాయకులా? కార్మిక నాయకులా? పోనీ కనీసం కార్మికులా? ఎవుర్రా యీళ్లు? మట్టి పిసుక్కుంటా మట్టిగొట్టక పొయ్యేవాళ్లు. ఇప్పుడే మయిందిరా? ఆ మట్టిలో కల్సిపొయ్యేది కొంచెం ఎనుకూ ముందయింది. దీనికే ఏందో ఉక్కిరి బిక్కిరై పోతావుండావే? పోనీ! చచ్చినోళ్లతో గూడా రైతులందురూ కట్టగట్టుకోని చావ బోతారా? సేద్దిం నాద్దిం నిలుపుదల చేసేసి స్ట్రయిక్ అని చాటబోతారా? అదెంతా ఏవీ లేదు. అట్టుండేటట్టుగా ఉంటే ఈ బాద పడాల్సిన పనేలేదు!

ఆ మాటకొస్తే రైతు పుట్టినప్పటినుండి చస్తానే ఉండాడు. దినమ్ము చచ్చేవాడికి ఏడ్సేవాడెవుడు గానీ నువ్వు పోరా అబ్బారే! పో!'' అనె.

అప్పులు తీసుకోని ఎగర గొట్టేదానికి తెల్సుకున్నోళ్లు ఎగబడి పోతానే ఉండారు. రైతు అంతో యింతో ఎగేసేదానికి తెల్సిన ఎరిముండ! వాడు ఎగరగొట్టేదానికి నేర్సుకోలా. ఆ కిటుకు వాళ్లు నేర్సుకుంటే? – ఎవురుండారబ్బా నేర్పించేదానికి? ఆ అరుణాచలం ఉండ్లా! ఆ మణిసినే అడిగితే? అప్పుడు తేలిపోతింది ఆయన లెక్కల్లో గెట్టితనం! అయినా నా తెలివి తెల్లార! ఆ పసిరికపాముకు యిట్లాంటి కిటుకులేడ తెలస్తాయిలే? ●